అప్రమత్తంగా లేకుంటే అంతే సంగతి!

- సెలవులకు ఊరెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు
- ముందుగా సమాచారమిస్తే ఇంటిపై నిఘా
- సొంతూర్లకు వెళ్లే వారు ఇవి పాటిస్తే శ్రేయస్కరం



రాజంపేట టౌన్ : ప్రస్తుతం విద్యార్థులందరికి దసరా సెలవులు ఇచ్చారు. అందువల్ల చాలా మంది గత రెండు రోజుల నుంచి తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు పయనం అవుతున్నారు. అక్టోబర్ 2వ తేదీ దసరా కావడంతో మరికొంత మంది కూడా ఊర్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. సాధారణంగా దొంగతనాలు ఎక్కువగా ప్రజలు ఇళ్లల్లో లేని సమయంలో జరుగుతుంటాయి. దొంగలు తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతుంటారు. ప్రస్తుతం ప్రజలు దసరా పండుగ కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నందున జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సైతం మీడియా ద్వారా దొంగతనాల నిరోధానికి ప్రజలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సెలవుల్లో ఊర్లకు వెళ్లే వాళ్లు తమ ఇళ్లకు గట్టి భద్రత ఏర్పాటు చేసుకోవడంతో పాటు డబ్బులు, బంగారు నగలు వంటి విలువైన వస్తువులు చోరీకి గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనావుంది. అలాగే ప్రయాణాల్లో సైతం అప్రమత్తంగా ఉండాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఊరికెళ్లేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చోరీలను అరికట్టవచ్చని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. అవేంటంటే

- బంగారు ఆభరణాలు లాకర్లలో పెట్టుకోవడం శ్రేయస్కరం
- లాకర్ల సదుపాయం లేని వారు నమ్మకస్తులైన బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో బంగారు నగలను భద్రపరుచుకోవాలి
- ఆర్థిక స్తోమత గల వారు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి
- వీలుకాని వారు రాత్రి వేళల్లో తమ బంధువులను కాని, స్నేహితులను కాని తమ ఇళ్లల్లో నిద్రించే ఏర్పాటు చేసుకోవాలి
- ఇంటి ప్రధానమైన తలుపునకు పటిష్టమైన తాళం వేసి కనిపించకుండా కర్టన్ వేయాలి
- ఇరుగు, పొరుగు వారిని అప్పుడప్పుడు ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పాలి
- ఊరికి వెళ్లాక రోజుకొకసారి అయినా ఇరుగు, పొరుగు వారికి ఫోన్ చేసి ఇంటి గురించి వాకబు చేయాలి
- ఊర్లకు వెళ్లేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ తమవెంట బంగారాన్ని బ్యాగుల్లో తీసుకెళ్లకూడదు

ప్రయాణ సమయంలో.. జాగ్రత్తలు

- ముఖ్యంగా రైళ్లల్లో ప్రయాణించేవారు తమ లగేజీ బ్యాగులకు చైన్‌వేసి తాళం వేసుకోవాలి
- రైల్వేస్టేషన్, బస్టాండుల్లో మంచినీళ్లకు, వాష్ రూంకు వెళ్లే సమయంలో తెలియని వారికి ఎట్టిపరిస్థితుల్లో లగేజీని అప్పగించకూడదు
- రైళ్లల్లో కిటికి పక్కన కూర్చునేవారు మెడలో వేసుకునే బంగారు నగలు బయటకు కనిపించకుండా జాగ్రత్తపడాలి
- తోటి ప్రయాణికులు ఏవైనా తినుబండారాలు ఇచ్చినా సున్నితంగా తిరస్కరించాలి.

పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి



దసరా సెలవుల్లో ఎవరైనా ఊరికి వెళ్లే వారు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేస్తే వారి ఇళ్లపై రాత్రి వేళల్లోనే కాక పగలు కూడా తమ సిబ్బందిచే ప్రత్యేకంగా నిఘా పెట్టిస్తాం. దొంగలు తాళాలు వేసి ఉంచిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడతారని అందువల్ల ప్రజలు కూడా చోరీలు జరగకుండా తమ ఇళ్లకు గట్టి భద్రత ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనావుంది. సెలవుల్లో రాత్రివేళల్లో గస్తీని మరింత పెంచుతాం. దొంగలకు అవకాశం ఇవ్వకుండా ప్రజలు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి.

– బి.నాగార్జున, అర్బన్ సీఐ, రాజంపేట

వడ్డెర్ల సమస్యలు పరిష్కరించిన వారికే మద్దతు

రాయచోటి టౌన్ : వడ్డెర్ల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కరించిన వారికే తమ మద్దతు ఉంటుందని రాష్ట్ర ప్రజాగళం అధ్యక్షులు ఇడగొట్టు నాగేశ్వరావు అన్నారు. శనివారం రాయచోటి వడ్డెర్ల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 40 లక్షల మంది వడ్డెర్లు ఉండగా వారిలో సుమారు 20 లక్షల మంది పునాది రాళ్లు, కంకర, బండలు కొట్టుకొంటూనే జీవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో అయినా వడ్డెర్ల ఓట్లు లేకుండా ఏ నాయకుడైనా గెలవగలడా అన్ని ప్రశ్నించారు. అయినా తమ సమస్యలపై ఎమ్మెల్యే, ఎంపీలు గళం విప్పకపోవడం విచారకరమన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వారికే మద్దతు ఉంటుందనేది గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పి.రెడ్డెయ్య, వేపన నాగార్జున, ప్రజాగళం జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ ఆర్.ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో ముందుంటాం

సుండుపల్లె : ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడంలో మానవత సంస్థ ఎప్పుడు ముందుంటుందని ఆ సంస్థ జిల్లా ఆర్థిక కార్యదర్శి, ఉపాధ్యాయుడు హరికుమార్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. త్వరలో మండలానికి సంస్థ ఆధ్వర్యంలో శాంతి రథం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

నేడు బిందె సేవ మహోత్సవం

రాజంపేట టౌన్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో ముఖ్య ఘట్టమైన బిందెసేవ గ్రామోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో బిందె సేవ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగే కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. గ్రామోత్సవం వెంబడి భక్తులు, ప్రజలను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కాగా గ్రామోత్సవం సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

సిద్దవటం : మండలంలోని కమ్మపాలెం గ్రామ సమీపంలోనిఎస్టీ (యానాది) కుటుంబాలకు ఆశాకిరణం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేసినట్టు సంస్థ అధ్యక్షులు గురునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నంద్యాల వెంకటసుబ్బయ్య, కోశాధికారి గంగాధర్, ఎ.చిన్నవెంకటయ్య, జి.వెంకటసుబ్బయ్య, వడ్లపూటి సురేంద్ర, శంకర్, నరసింహారెడ్డి, టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

వీరబల్లి : మండల పరిధిలోని సానిపాయి గ్రామ పంచాయతీ జింకా దళితవాడలో ఆదివారం రామాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానంతో కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు జరిపారు. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరనాగిరెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, రాష్ట్ర బూత్ కమిటీల ప్రధాన కార్యదర్శి రెహమాన్‌ఖాన్, సర్పంచులు తాటిగుట్ల నాగిరెడ్డి, రామాజయచంద్ర, ఐటీ వింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సీతారామరాజు, దేవాలయ స్థల దాత రామచంద్రనాయుడు, చంద్రనాయక్, గుగ్గిళ్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి

పుల్లంపేట : పద్మశాలీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అఖిల భారత పద్మశాలీ సంఘం కార్యదర్శి, ఎస్‌బీవీడీ విద్యాసంస్థల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు అన్నారు. అఖిల భారత పద్మశాలీ సంఘం కార్యదర్శిగా ఎంపికైన శ్రీరాములను శనివారం పద్మశాలీలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అఖిల భారతస్థాయిలో కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలీల సామాజిక స్థితిగతులను మెరుగుపరచడానికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు.

విమర్శలు కాదు అభివృద్ధి చేయండి

సంబేపల్లె : వైఎస్ఆర్‌సీపీ నాయకులను విమర్శించడం పక్కన పెట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జనరల్ సెక్రటరీ ఎం.చిదంబర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డిలను రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ జగన్‌మోహన్‌రాజు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కరోనా సమయంలో కష్టాలు పడుతున్న ప్రజలకు ఎన్నో సేవలు అందించిన వారిపై విమర్శలు చేయడం తగదన్నారు. సేవా కార్యక్రమాలను గుర్తుంచుకొనే రాజంపేటలో అమరనాథ్‌రెడ్డికి ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులపై నిరాధార ఆరోపణలు చేసిన చమర్తి బహిరంగ క్షమాపణ చెప్పాలని చిదంబర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

నందలూరు : మండలంలోని నందలూరు దళితవాడలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి, రాజగోపాల్ రెడ్డి విచ్చేశారు. ఎన్ఎస్ఎస్ కార్యకర్తల పనితీరు ప్రశంసించి ఇద్దరు ఉత్తమ కార్యకర్తలకు నగదు బహుమతి అందించారు. ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు సేవలో ముందు ఉంటారని జీవన నైపుణ్యాలు, విలువలు పెంపొందించుకుంటారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీఓ డా.నీలవేణి మాట్లాడుతూ సమాజం నుంచి కార్యకర్తలు చాలా నేర్చుకొంటారని, విద్యలో ఇలాంటి సేవా కార్యక్రమాలు అంతర్భాగమని తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఓటు గురించి, ఓటర్ల చైతన్యం గురించి ర్యాలీ, ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కార్యకర్తలకు 'డిజిటల్ బుక్' శ్రీరామరక్ష



డిజిటల్ బుక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట టౌన్ : కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు పరాకాష్ఠకు చేరుకున్నాయని, కార్యకర్తలకు అండగా ఉండేందుకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోలా వెంకటరమణారెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు డిజిటల్ యాప్ ఎంతగానో దోహదపడగలదన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎక్కడ అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. దీని ద్వారా బాధితులకు అన్ని రకాలుగా పార్టీ అండగా నిలుస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎవరైనా గొంతెత్తితే వారి గొంతునొక్కేలా కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరెళ్ల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి రాకాసి శ్రీవాణి, మిర్యాల సురేఖ, పాపినేని విశ్వనాథరెడ్డి, వడ్డే రమణ, డి.భాస్కర్‌రాజు, ఖాజామొహిద్దీన్, దండు గోపి, జాహిద్ అలీ, దాసరి పెంచలయ్య, నాగా శేఖర్‌రెడ్డి, జీవీ సుబ్బరాజు, వేల్పుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు గుర్రం జాషువా



గుర్రం జాషువా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట టౌన్ : సమాజంలో కుల వివక్ష, సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన యోధుడు గుర్రం జాషువా అని, జాషువా ఆదర్శాలు మనందరికి స్ఫూర్తిదాయకమని శ్రీశైలం భ్రమరాంభికా మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. పట్టణంలోని జీఎంసీ కల్యాణ మండపంలో ఆదివారం గుర్రంజాషువ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ సంస్కరణలకు సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకొని జాషువా చేసిన రచనలు అనిర్వచనీయమన్నారు. జాతీయ ఉద్యమ కాలంలో భరతమాత గొప్పతనాన్ని చాటిచెప్పే అనేక విషయాలను తన కవిత్వంలో పొందుపరిచి ప్రజల్లో దేశభక్తిని కూడా నింపారన్నారు. తన కలంతో అప్పట్లో సమాజంలో ఉన్న కులవివక్ష, అసమానతలను పారద్రోలేందుకు జాషువా చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. జాషువ కవిగా, సంఘ సంస్కర్తగా చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదన్నారు. తొలుత జాషువ చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. అనంతరం జాషువ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు కాకర్ల రాముడు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు గంగనపల్లె వెంకటరమణ, బీజేపీ నాయకులు ఆనందగజపతిరాజు, పిండిబోయిన కృష్ణయాదవ్, గడ్డం చంద్రరాజు, సునీత నారాయణవర్మ, షబ్బీర్ అహమ్మద్, నరేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు నివాళి



భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాల వద్ద క్లబ్ సభ్యుల నివాళి

నందలూరు : మండలంలోటని నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లిలోని బచ్చు భవన్ నందు దేశం గర్వించదగ్గ ఇరువురు మహనీయులు భగత్‌సింగ్, గుర్రం జాషువాల జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విభా ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయభాస్కరరావు అధ్యక్షతన ఆదివారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మన్నెం రామమోహన్ మాట్లాడుతూ గుర్రం జాషువా తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢచారాల వ్యతిరేకిస్తూ గబ్బిలం, పిరదౌసి వంటి సుప్రసిద్ధ నవలలు రచించారన్నారు. అలానే స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని తెలిపారు. మహనీయులను వారి జయంతి నాడు గుర్తు చేసుకోవడం మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బచ్చు భాస్కరరావు, కుర్రా మణియాదవ్, ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, మారయ్య, గండికోట కృష్ణకుమార్, ఆంజనేయులు, తీగలకుంట వెంకటేష్ పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలి



రాజంపేట రూరల్: కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేస్తున్న డాక్టర్ ప్రతాప్



రాయచోటి టౌన్: అవగాహన ర్యాలీ తీస్తున్న వైద్యశాఖ అధికారులు

రాయచోటి టౌన్ : పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలని వైద్యశాఖ ఏడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం రాయచోటిలో వైద్యులు, వైద్యాధికారులు, సిబ్బందితో కలసి ప్రజలకు రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించడంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2030 నాటికి రేబిస్ ఫ్రీ ఇండియా అనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. కుక్కకాటుకు గురైన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాయచోటిలో ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా రేబిస్ టీకాలు వేయబడునని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి. సునిల్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : పెంపుడు కుక్కలకు యజమానులు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించుకోవాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ తెలియజేశారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పెంపుడు కుక్కలకు టీకాలను అందించారు. కార్యక్రమంలో మొబైల్ అంబులెన్స్ వెటర్నరీ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జూనియర్ వెటర్నరీ డాక్టర్ ఎం.వరదయ్య, పశుదన సహాయకులు బి.మణి, దత్తాత్రేయ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మోముల్లో చిరునవ్వులు నింపాలి



రాజంపేట టౌన్: ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి



నందలూరు: తోగూరుపేటలో దాసాలమ్మ ఆలయ వార్షికోత్సవంలో ఆకేపాటి

రాజంపేట టౌన్ : రేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని మన్నూరులో వెలసిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది సంవృద్ధిగా వర్షాలు కురిసి రైతుల ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలని, అలాగే ప్రజలకు మేలు చేసేలా కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధిప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ప్రజలంతా దసరా ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలా వెంకటరమణారెడ్డి, బొప్పా ఎల్లారెడ్డి, డీలర్ సుబ్బరామిరెడ్డి, మిర్యాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.

దాసాలమ్మకు ఆకేపాటి ప్రత్యేక పూజలు

నందలూరు : మండలంలోని తోగూరుపేట గ్రామ దేవత శ్రీ దాసాలమ్మ వార్షికోత్సవ ఉత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జొన్న వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ రవీంద్రారెడ్డి, సంతోష్, భాస్కర్‌రెడ్డి, నరసయ్య, గుండు మల్లికార్జునరెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకులు రాత్రిళ్లు వీధుల్లో తిరగరాదు

రాయచోటి టౌన్ : అర్ధరాత్రి వరకు వీధుల్లో తిరిగే ఆకతాయిలపై పోలీసులు చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి అర్బన్ సీఐ చలపతి తన సిబ్బందితో పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీ చేశారు. రాత్రి పది తరువాత అవసరముంటేనే రోడ్ల మీదకి రావాలని, లేకుంటే కఠినంగా వ్యవహరిస్తామని యువకులను హెచ్చరించారు. అలానే యువకుల నుంచి పోలీసులు వేలిముద్రలు సేకరించారు. రాత్రి వేళ్ల ఎవరైనా అనుమానంగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. అనంతరం పట్టణంలోని పలు లాడ్జీలను ఆకస్మిక తనిఖీ చేశారు.

దొంగల నుంచి ఇంటిని కాపాడుకుందాం



బాబు, సీఐ, ఒంటిమిట్ట

సిద్దవటం : దొంగల నుంచి ఇంటిని కాపాడుకుంటేనే ప్రతి ఇంట్లో దసరా పండుగ సంతోషం నిలుస్తుందని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. సిద్దవటం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ పండుగలు అంటే కుటుంబం, బంధువులతో గడిపే మధురమైన సమయం అని, ఈ సమయంలో మనం నిర్లక్ష్యం చేస్తే దొంగలు ఆ ఆనందాన్ని చెడగొట్టే ప్రమాదం ఉందన్నారు. కొంత మంది ప్రజలు పండుగ ఉత్సాహంలో ఇంటిని వదిలి బంధువుల దగ్గరికి వెళ్తారన్నారు. అప్పుడు ఆ ఇళ్లను దొంగలకు టార్గెట్ అవుతాయని ఒక్క చిన్న జాగ్రత్త మరిచిన అది పెద్ద నష్టాన్ని కారణమవుతుందన్నారు. మాధవరం, ఉప్పరపల్లి, ఎస్‌కెఆర్ నగర్, పార్వతీపురం గ్రామాల్లో పండుగ వేడుకల్లో గృహ నివాసులు చాలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నవరాత్రుల్లో రాత్రివేళలో అమ్మవార్ల గుడిలకు వెళ్లేటప్పుడు ఇంటికి తాళం వేసేటప్పుడు జాగ్రత్త వహించాలని చెప్పారు. ద్విచక్ర హనంలో కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం తెలపాలని, దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు గృహ నివాసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ పేర్కొన్నారు.

జయములివ్వు జగజ్జనని

జయములివ్వు జగజ్జనని అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాలు ముగింపు దశకు చేరుకుంటుండటంతో భక్తులు అమ్మవారి ఆలయాలకు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక అలంకరణల్లో ఉన్న దేవతా మూర్తులకు పూజలు నిర్వహించి ప్రణమిల్లుతున్నారు. కాగా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమివ్వగా రాజంపేటలోని అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవీ గాయత్రిదేవి అలంకారంలో కనిపించారు.

– సాక్షి,నెట్‌వర్క్



వీరబల్లి: భక్తులకు వైఎస్సార్‌సీపీ నాయకుల అన్నదానం



రాజంపేట టౌన్: పార్వతీదేవి అలంకారంలో వీరచౌడేశ్వరి



చిన్నమండెం: శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారంలో వాసవీ



రాజంపేట రూరల్: శ్రీధనలక్ష్మీ దేవిగా కనదుర్గమ్మ



పెనగలూరు: చండీమాత అలంకారంలో కామాక్షమ్మ



రాయచోటి జగదాంబసెంటర్: శ్రీ మహాలక్ష్మీగా దాక్షాయిణీ



నందలూరు: గాయత్రీదేవిగా కరుణిస్తున్న కన్యకాంబ



ఒంటిమిట్ట: అమ్మవారిశాలలో గాయత్రి దేవి అలంకారం



రాజంపేట టౌన్: భగవతీదేవి అలంకరణలో మారెమ్మ



సుండుపల్లెలో కృష్ణమూర్తి అలంకారం



పుల్లంపేట: ప్రత్యేక అలంకారంలో మారమ్మ తల్లి



రాజంపేట టౌన్: పూజల్లో పాల్గొన్న మహిళలు



రాయచోటి టౌన్: సారెను అందజేస్తున్న ఆలయ అధికారులు



రాయచోటి టౌన్: మహాలక్ష్మి అలంకరణలో భద్రకాళి